

అతివేగానికి ఎనిమిదిమంది బలి

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది నిండుప్రాణాలు బలయ్యాయి.17మంది గాయాలపాలై ఆస్పత్రుల పాలయ్యారు.ఈ రెండు ప్రమాదాలకూ అతివేగమే కారణం కావడం విశేషం.ఒక ప్రమాదంలో లారీని ఓవర్ టేక్ చేయబోయిన ఆర్టీసీ బస్సు తుక్కుతుక్కు కాగా మరో ప్రమాదంలో సర్వీసు రోడ్డుపై వెళుతున్న ఇద్దరిని ఢీకొట్టి మృత్యుఒడికి చేర్చిన కారు ధ్వంసమైంది.





ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హేత్విక్, కేశవులురెడ్డి, తులసి(ఫైల్ ఫొటోలు)

లారీని దాటబోయి ఢీకొన్న బస్సు

జిల్లావాసులు నలుగురు సహా తిరుపతి చిన్నారి మృతి

ఇద్దరు బస్సు డ్రైవర్లు సహా 14 మందికి గాయాలు



లారీని ఢీకొట్టి దెబ్బతిన్న బస్సు

వెదురుకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరు శివారుప్రాంతమైన హొస్కోటలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.14మంది గాయాలపాలయ్యారు. తిరుపతి నుంచి బెంగళూరుకు చిత్తూరు టూ డిపో బస్సు గురువారం రాత్రి 31మంది ప్రయాణికులతో బయల్దేరింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో హొస్కోట సమీపంలో గొట్టిపుర గేట్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టింది.ఆ వేగం ధాటికి బస్సు కుడివైపు సగందాకా తుక్కుతుక్కు అయిపోయింది.దీంతో డ్రైవర్ వెనుకవైపు కూర్చున్నవారిలో ఐదుగురు మృతిచెందారు.తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లెకు చెందిన హరిబాబు కుమార్తె ప్రణతి(5), చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన కె.జనార్ధన రెడ్డి కుమారుడు 40రోజుల వయసున్న హేత్విక్, కె.కేశవులురెడ్డి(44), ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరుకు చెందిన తులసి అలియాస్ తనూజ(22), బెంగుళూరులోని జేపీనగర్‌లో స్థిరపడ్డ గంగాధర నెల్లూరు మండలం మారేడుపల్లెకు చెందిన శారద(43) మృతి చెందిన వారిలో వున్నారు.తీవ్రంగా గాయపడ్డ ఆర్టీసీ బస్సు డ్రైవర్ వీఎల్‌కే కుమార్‌ను సిలికాన్ సిటీ ఆస్పత్రిలో చికిత్స చేయించాక మెరుగైన చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. అలాగే బెంగుళూరులోని జేపీ నగర్‌కు చెందిన ధనలక్ష్మి(37),వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన కె.గిరిజ(22) సిలికాన్ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.స్వల్పగాయాలతో బెంగళూరులోని జేపీనగర్‌కు చెందిన సిద్ధయ్య(42), వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన కె.పాపమ్మ(63), జశ్విన్(3), జనార్ధన రెడ్డి(32),సోమేంద్రపురానికి చెందిన చతుర్య(19), నచ్చుకూరుకు చెందిన రోహిత్ రెడ్డి(11), రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లెకు చెందిన హరిబాబు కుమార్తెలు మాధురి(9), కాత్యాయని(11) గాయపడిన వారిలో ఉన్నారు.

గంగమ్మ ఉత్సవాలకని వచ్చి.....

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రమాద మృతుల్లో ఒకరైన ప్రణతి తండ్రి ఒంటెల హరిబాబు స్వస్థలం రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లె. ఆర్మీలో ట్రైనింగ్ అధికారిగా బెంగళూరులో పనిచేస్తున్నాడు.స్వగ్రామంలో గంగమ్మకు జరిగే కుంభాల ఉత్సవాలకు కుటుంబంతో



ప్రణతి, హేత్విక్ మృత దేహాలు

వచ్చిన హరిబాబు తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో చిన్న కుమార్తె ప్రణతి(5)ని కోల్పోయాడు.పెద్దకుమార్తె కాత్యాయని ఎడమకాలు విరిగిపోగా, రెండవ కుమార్తె మాధురి కుడిచెయ్యికి తీవ్రగాయమైంది.

పినతండ్రి కర్మక్రియలకొచ్చి...

గంగాధరనెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో మృతి చెందిన శారద (42) కుటుంబం బెంగళూరులో స్థిరపడ్డా ఆమె స్వస్థలం గంగాధర నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె పంచాయతీ మారేడుపల్లె. భర్త విశ్వనాధరెడ్డి, కుమారుడు తేజు, కుమార్తె తేజస్వినిలతో బెంగుళూరు సిటీలో శారద ఉంటోంది. శారద ఇండ్ల పనికి వెళుతుండగా, విశ్వనాధరెడ్డి తాపీమేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.మారేడుపల్లెలో పినతండ్రి కర్మక్రియలకు హాజరయ్యేందుకు శారద గురువారం ఉదయం స్వగ్రామానికి వచ్చింది. అదే రోజు రాత్రి బస్సులో బెంగళూరు వెళుతుండగా ప్రమాదానికి గురై మృతి చెందింది. ఇదే మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన టీడీపీ నేత మురగారెడ్డి కుమారుడు లక్ష్మీకరుణ కుమార్ రెడ్డి అలియాస్ వి.ఎల్.కె.కుమార్ రెడ్డి అలియాస్ డ్రైవర్ కర్ణ చిత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. గురువారం రాత్రి ఆయన నడుపుతున్న బస్సే హొస్కోట వద్ద ప్రమాదానికి గురైంది.తీవ్రగాయాల పాలైన ఆయన్ను శుక్రవారం అతని బంధువులు హొస్కోట ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యంకోసం బెంగుళూరు సిటీలోని అపోలో ఆస్పత్రికి తరలించారు.



శారద (ఫైల్ ఫొటో)




గాయాలతో ఆర్టీసీ డ్రైవర్ కుమార్‌రెడ్డి

ఆళ్లమడుగులో విషాదం



కేశవులురెడ్డి భార్య, పిల్లల రోదనలు

వెదురుకుప్పం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన ఓ నలభై రోజుల చిన్నారి సహా ఓ దినసరి కూలీ చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది కూలి పనులతో జీవనం సాగించే ఆళ్లమడుగుకు చెందిన కామసానికి కేశవులురెడ్డి(44) అతని తమ్ముడు కె.జనార్ధన రెడ్డి(32), తమ్ముడి భార్య గిరిజ(22), తమ్ముడి కుమారులైన నలభై రోజుల వయసున్న హేత్విక్, జశ్విన్‌రెడ్డి(4), అమ్మ పాపమ్మ(62) గురువారం రాత్రి బెంగుళూరులోని పుట్టానహళ్లికి బయలుదేరారు.హొస్కోట దగ్గర ప్రమాదంలో కేశవులురెడ్డి(46), హేత్విక్ మృత్యుఒడిలోకి చేరుకున్నారు. జనార్ధన రెడ్డి, గిరిజ, జశ్విన్‌రెడ్డి, పాపమ్మ గాయపడ్డారు. వీరిలో గిరిజ పరిస్థితి విషమంగా ఉంది.



పుల్లూరు చేరిన తులసి మృతదేహం

ఏకైక కుమార్తె మృతితో దిగ్భ్రాంతి

ఎస్ఆర్ పురం మండలం పుల్లూరుకు చెందిన మునిలక్ష్మి, రమేష్ దంపతుల ఏకైక కుమార్తె తనూజ అలియాస్ జి.తులసి(22) బీటెక్ పూర్తి చేసుకుంది.బెంగుళూరులో కంప్యూటర్ కోర్సు చేసేందుకు తన పినతండ్రి జి.సిద్ధయ్య(42)తో బస్సులో వెళుతూ ప్రమాదంలో మృతిచెందింది.తమకు దాపుగా ఉంటుందనుకున్న కుమార్తె రోడ్డు ప్రమాదం బారినపడి చనిపోవడాన్ని ఆమె తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.శుక్రవారం సాయంత్రం ఆమె మృత దేహం స్వగ్రామానికి చేరుకుంది.



తులసి తల్లి రోదన

థామస్ టీమ్ సేవలు

వెదురుకుప్పం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రమాద సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సూచనలతో ఆయన అనుచరులు హరీష్ యాదవ్, బోడిరెడ్డి సుధాకరరెడ్డి, దామోదరరెడ్డి తదితరులు బెంగళూరుకు చేరుకుని క్షతగాత్రులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో థామస్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.బస్సు ప్రమాదం తనను కలచివేసిందని థామస్ తెలిపారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.50లక్షల చొప్పున అందించాలని, గాయపడిన వారికి రూ.10లక్షలు తక్షణ సాయం అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు.

బెంగుళూరు ఆస్పత్రిలో థామస్ అనుచరబృందం



అదుపుతప్పిన కారు ముగ్గురిని బలిగొంది

మృతుల్లో టీడీపీ సీనియర్ నేత, వ్యవసాయశాఖ ఉద్యోగి

చిన్నారి, ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన కారు

బంగారుపాళ్యం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అతివేగానికి ముగ్గురు బలయ్యారు. ఓ చిన్నారి, ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో టీడీపీ సీనియర్ నాయుడు, వ్యవసాయ శాఖ ఉద్యోగి ఉన్నారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు పాతపేట ఆర్ఆర్ వీధికి చెందిన సయ్యద్ దిలీప్(53)కు అనారోగ్యం కారణంగా తన భార్య ముబీనా, కుమార్తె హుష్నా, మనవరాలు (ఆరు నెలలు), అల్లుడు షాహిద్ ఆలీ శుక్రవారం ఉదయం చిత్తూరుకు కారులో బయల్దేరాడు. షాహిద్ ఆలీ కారును నడుపుతున్నాడు. మార్గమధ్యంలో చెన్నై- బెంగుళూరు జాతీయ రహదారిపై కారు అతివేగంగా వెళుతోంది. బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలోని రాజేంద్రనాయుడు మామిడి తోట వద్దకొచ్చేసరికి అతివేగానికి కారు అదుపుతప్పింది. ఆపై అక్కడున్న సర్వీసు రోడ్డులో నిలబడి మాట్లాడుకుంటున్న తిమ్మోజుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రైతు విభాగ మండల మాజీ అధ్యక్షుడు వక్కల రాజేంద్రనాయుడు (54), అదే గ్రామానికి చెందిన తంగరాజు కుమారుడు సాదరయ్య(45)పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో రాజేంద్రనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా.. సాదరయ్యకు కాలు, తలకు తీవ్రగాయాలై మామిడితోపులోకి ఎగిరిపడ్డాడు. మరోవైపు కారు నుజ్జునుజ్జవడంతో అందులోని సయ్యద్ దిలీప్.. సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతి చెందాడు. ఆయన భార్య, కుమార్తె, మనవరాలికి తీవ్రగాయాలయ్యాయి. అల్లుడు షాహిద్ ఆలీ ఒక్కడే సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడ్డ నలుగురినీ 108 అంబులెన్స్ ద్వారా తొలుత బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో సాదరయ్య మృతి చెందాడు. కాగా, సాదరయ్య బంగారుపాళ్యం మండలంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారిగా పనిచేస్తూ రెండ్రోజుల కిందటే గంగవరం మండలానికి బదిలీపై వెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





వక్కల రాజేంద్రనాయుడు, సాదరయ్య (ఫైల్‌ఫొటోలు), సయ్యద్ దిలీప్ మృతదేహం

అమ్మకు ఆనందం

సూపర్‌సిక్స్‌లో మరో పథకం ప్రారంభం

- చంద్రబాబు నిలబెట్టుకున్న మరో హామీ
- 2,60,641మంది పిల్లల నగదు రూ.338 కోట్లు..... 1,30,382మంది తల్లుల ఖాతాల్లో జమ

చిత్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు అమల్లోకి తెచ్చారు.ఇంట్లో ఎంత మంది స్కూల్‌కు వెళ్లే పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం కింద సాయం అందిస్తామని చెప్పిన మాటను నిజం చేశారు.శుక్రవారం నుంచి తల్లుల ఖాతాల్లో డబ్బులు పడడం ప్రారంభమైంది.ప్రస్తుతానికి 2,60,641 మంది విద్యార్థుల్ని, 130,382 తల్లుల్ని అర్హులుగా గుర్తించారు.వీరిలో 1,56,336 మంది ప్రభుత్వ, 1,04,305 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులున్నారు. ఈసారి మిస్ అయినవారితో పాటు ఒకటో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు మరో విడతలో నిధులు జమ కానున్నాయి. వైసీపీ హయాంలోలాగే కూటమి ప్రభుత్వం కూడా రూ.13 వేలు పిల్లలకు, రూ.2 వేలు పాఠశాల నిర్వహణకు కేటాయించింది. అంటే ముగ్గురు పిల్లలున్న తల్లి ఖాతాలో రూ.39 వేలు, ఇద్దరు పిల్లలున్న తల్లికి రూ.26 వేలు, ఒకరుంటే రూ.13 వేలు చొప్పున డబ్బులు పడుతున్నాయి. ఈ విడతలో రూ.338.83 కోట్ల నిధుల్ని చిత్తూరు జిల్లాకు కేటాయించారు.

నాడు

అమ్మఒడి పొందిన తల్లులు : 1.52 లక్షలు

అందిన సాయం : రూ. 197 కోట్లు

నేడు

తల్లికి వందనం లబ్ధిదారులు : 2.60 లక్షలు

అందిన సాయం : రూ.338 కోట్లు



ఊహించలేదు

వైసీపీ హయాంలో ఒక బిడ్డకే డబ్బులు వచ్చేవి. ఇప్పుడు కూడా ఒకరికే ఇస్తారనుకున్నా. కానీ, ఊహించని విధంగా నా ముగ్గురు బిడ్డలు సాఫియా, అలీషా, సల్మాన్‌లకు రూ.13 వేలు చొప్పున రూ.39 వేలు శుక్రవారం నా అకౌంట్‌లో పడ్డాయి.సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

- జరీనా, పులిచెర్ల మండలం

మాకెంతో సంతోషం

వైసీపీ ప్రభుత్వం ఒకరికే ఇవ్వడమే కాక రెండేళ్లు ఇవ్వకుండా మోసం చేసింది.నాకు 8,6,3 తరగతులు చదివే నవీష , జీజేష్ 6, షైషాలి అనే పిల్లలున్నారు. వారందరికీ కలిపి రూ.39 వేలు శుక్రవారం నా ఖాతాలో పడ్డాయి. మాకెంతో సంతోషంగా ఉంది. మిగిలిన హామీలన్నీ కూడా చంద్రబాబు అమలు చేస్తారనే నమ్మకం దీంతో పెరిగింది.

- అశ్విని, రామకుప్పం మండలం





చదువులకు ఇబ్బంది లేదు

కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం.పిల్లల చదువులకు చాలా ఇబ్బందిగా వుంటోంది.పెద్దకూతురు పల్లవి ఇంటర్‌లో చేరింది. రెండో కూతురు కావ్య 8వ తరగతి,మూడో కూతురు ప్రియ 3వ తరగతి చదువుతున్నారు.గత ప్రభుత్వంలోలా ఒక్క బిడ్డకే కాకుండా ముగ్గురికీ తల్లికి వందనం పేరిట రూ.39 వేలు పడడంతో వారి చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది.

- చిత్ర, చౌడేపల్లె మండలం

భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్లు, షెడ్లు



తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్ లోస్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు వసతులు ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 430 మీటర్లు నిర్మిస్తున్న క్యూలైన్‌ను మరో 150 మీటర్ల మేరకు పెంచనున్నారు. ఎండ, వానలకు ఇబ్బంది లేకుండా 2,400 మంది వేచిఉండేలా రెండు శాశ్విత షెడ్లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందువల్ల క్యూలైన్లతో కలిపి 5600 మందికి సౌకర్యం కలుగుతుంది. అలాగే భూదేవి కాంప్లెక్స్ పైఅంతస్థును కూడా టోకెన్ల కోసం వచ్చే భక్తులకు వినియోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. శ్రీనివాసంలోనూ శాశ్విత క్యూలైన్ల నిర్మాణం కోసం టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇంజినీరింగ్ అధికారుల బృందం టోకెన్ల జారీ కేంద్రాలను పలుమార్లు పరిశీలించాక ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు.



భూదేవి కాంప్లెక్స్ వద్ద స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల కోసం వేచిఉన్న భక్తులు


శిలాతోరణం సర్కిల్ దాకా క్యూ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.11 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,609

తలనీలాలు సమర్పించినవారు: 33,144



నడకదారిలో భద్రత భేష్!



సేవకుడికి ఫీడ్‌బ్యాక్ ఇస్తున్న సురేష్‌బాబు

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏర్పాట్లు అన్నీ చాలా బావున్నాయని నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు చెప్పారు. కాలినడకన తిరుమలకు వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, నడకమార్గంలో భక్తుల భద్రత కోసం తీసుకున్న జాగ్రత్తలు బావున్నాయని అన్నారు.ప్రసాదాల రుచి బావుందని చెప్పారు. తిరుమలలో సేవలపై సురేష్‌బాబును ఒక సేవకుడు ఫీడ్‌బ్యాక్ కోరగా ఓపికగా అన్ని ప్రశ్నలకూ సమాధానాలు ఇచ్చారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



రాజ్యసభ కమిటీ

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రభుత్వ హామీల రాజ్యసభ కమిటీ చైర్మన్ తంబిదొరై, సభ్యులు, ఎంపీ పార్థసారథి, రాజస్థాన్ మంత్రులు జవహర్ సింగ్ బేఢం, కృష్ణకుమార్ వైష్ణోయ్, సెల్కాన్ ఎండీ గురుస్వామిని నాయుడు ఉన్నారు. దర్శనం అనంతరం రాజస్థాన్ మంత్రులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శ్రీసిటీ- నాఫ్ ఇండియా పరిశ్రమకు గ్రీన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాఫ్ ఇండియా ప్రతినిధి నాగరాజు కట్టా

శ్రీసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు 'గ్రీన్ (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఈనెల 12న నిర్వహించిన గ్రీన్‌కో సమ్మిట్‌లో ఈ అవార్డును నాఫ్ ఇండియా పరిశ్రమకు అందజేశారు. 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో నికర సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించి అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమల ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. గ్రీన్ అవార్డును అందుకున్న నాఫ్ ఇండియా పరిశ్రమ యాజమాన్యాన్ని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

ఈత సరదాతో ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి



మురళి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సరదా కోసం ఈతకు వెళ్లిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లుకు చెందిన పెరిమిడి మురళీకృష్ణ(19) శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ చదువుతున్నాడు. ఇటీవల సెలవులకు ఇంటికి వచ్చాడు. ధనుష్, ప్రశాంత్‌తో కలిసి గురువారం తొట్టంబేడు మండలం సింగమాల వద్ద తెలుగుగంగ కాలువలో ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో మురళీకృష్ణ గల్లంతయ్యాడు. విద్యార్థి తండ్రి బాలాజీ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. చీకటి పడడంతో వెనుదిరిగారు. శుక్రవారం మురళీకృష్ణ మృతదేహాన్ని తెలుగు గంగ కాలువలో గుర్తించి ఒడ్డుకు తెచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు మ్యాంగోనగర్‌కు మంత్రి అచ్చెన్న

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించనున్నారని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మామిడి రైతులు, వ్యాపారులతో సమావేశమై మామిడి ధరలు, అమ్మకాలపై సమీక్షిస్తారన్నారు.

డీఎస్‌డీవోగా శశిధర్



కలెక్టర్‌ను కలిసిన నూతన డీఎస్‌డీవో శశిధర్

తిరుపతి(క్రీడలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో)గా ఎన్.శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఇప్పటి వరకున్న సయ్యద్‌సాహెబ్ గత ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. అదనపు బాధ్యతలను చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అప్పగించారు. శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు స్పందించి సీనియర్ కోచ్(టెన్నిస్)ఎన్.శశిధర్‌ను డీఎస్‌డీవోగా నియమించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు శాప్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రం శ్రీనివాస క్రీడా సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. క్రీడల అభివృద్ధికి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా వేదికలపై దృష్టి పెడతామన్నారు.



● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఔను..వీరు ఆపద్బాంధవులు

అర్జెంట్‌గా ఓ పాజిటివ్ రక్తం కావాలి.. ఆస్పత్రిలో ఓరోగి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు ఈ నంబరుకు సంప్రదించండి.. ఇలాంటి అభ్యర్థనలు ఇటీవల వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో చూస్తున్నాం. వైద్యశాస్త్రం ఇంత అభివృద్ధి చెందాక కూడా రక్తం దొరకదా.. బ్లడ్ బ్యాంకులు ఉంటాయి కదా అని ఎక్కువ మంది భావిస్తుంటారు. ఔను ..బ్లడ్ బ్యాంకులున్నాయి. కానీ ఇందులో నిల్వ ఉండాలంటే దాతలు ముందుకు వస్తేనే సాధ్యమతుందని గ్రహించాలి. రక్తం ఇవ్వడమంటే సాటి మనిషికి ప్రాణం పోయడమని గుర్తించాలి. ఇలా స్పందించేవారిని దైవ స్వరూపులుగానే భావించాలి. ఇదిగో వీరిని చూడండి..అవతలి వ్యక్తితో ఏబంధమూ లేకున్నా మానవత్వంతో కదిలి తరచూ రక్తదానం చేస్తున్నారు. పదుగురికీ స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఏటా ఐదుసార్లు ఇవ్వవచ్చు



రక్తదానం ద్వారా ముగ్గురిని కాపాడవచ్చు. ఆరోగ్యంగా ఉన్న వారు ఏడాదిలో ఐదు సార్లు వరకు రక్తదానం చేయవచ్చు. దాని వలన మరింత ఉత్తేజకంగా, ఆరోగ్యంగా ఉంటారు. శరీరంలో నుంచి రక్తం సేకరించేందుకు ఎక్కువ సమయం పట్టదు. నొప్పి కూడా ఉండదు. 18 ఏళ్ల దాటిన ఆరోగ్యవంతులు నిస్సందేహంగా రక్తదానికి ముందుకు రావాలి

- డాక్టర్ హరిత, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి, రుయాస్పత్రి



ఇప్పటికి 60సార్లు రక్తదానం చేశా..

రోడ్డు ప్రమాదానికి గురైన ప్రాణ మిత్రుడి బంధువొకరు సకాలంలో రక్తం అందక నా కళ్ల ముందే చనిపోయారు. అది చూసి నా మనసు చలించిపోయింది. అప్పటి నుంచి ఏడాదికి రెండు, మూడు సార్లు కాదు ..అవసరమైతే ఎక్కువసార్లు రక్తదానం చేసున్నాను. పుట్టిన రోజుతోపాటు ఇంట్లో ప్రత్యేక దినాల్లోనూ తప్పక రక్తదానం చేస్తాను. ఇప్పటికే 60 సార్లు రక్తదానం చేశాను. నా భార్యకు కూడా కూడా పదిసార్లు రక్తదానం చేసింది.

- అబ్దుల్ కలాం ఆజాద్, తిరుపతి



ప్రాణాలను నిలబెట్టాలనే తపన

ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందకపోతే ఎదురయ్యే కష్టాన్ని స్వానుభవంతో తెలుసుకున్నాను. ఇలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని భావించాను. అందుకే నావంతు సాయంగా స్పందిస్తున్నాను. ఇప్పటికే 32 సార్లు రక్తదానం చేశాను. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక రోజంటూ లేదూ. సమయం దొరికినప్పుడల్లా వెళ్లి రక్తదానం చేస్తున్నాను. ఇతరుల ప్రాణాలు నిలబెట్టేందుకు ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను.

- పి.మకరంద్, తిరుపతి

వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తాను



రోడ్డు ప్రమాదానికి గురైన వారిని ఆస్పత్రికి సకాలంలో తీసుకువెళ్లినా అవసరమైన రక్తం దొరక్క చనిపోయిన వారిని చాలా మందిని చూశాను. ఆ సమయంలో చేసే చిన్నపాటి రక్తదానం వారి ప్రాణాలను నిలబెడుతుందని తెలుసుకున్నాను. వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తుంటాను. మొబైల్ రక్తదాన శిబిరాలు కనిపించినా వెళ్తుంటాను. ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశాను.

-డి.మునిశేఖర్ చౌదరి, ఆర్టీసీ ఉద్యోగి, తిరుమల

కొత్త కణాలు ఉత్పత్తవుతాయి



రక్తదానంతో దుష్ఫలితాలు ఉండవు. దాతల ఎముకల్లో మూలుగ ఉత్తేజితమై కొత్త రక్త కణాలు ఉత్పత్తవుతాయి. ఫలితంగా మరింత ఆరోగ్యవంతులుగా జీవిస్తారు. 18-60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులు రక్తదానం చేయొచ్చు. హెచ్ఐవీ, మలేరియా, కామెర్లు, మధుమేహం, గుండెపోటు, వైరల్ హెపటైటిస్, కాలేయం, మూత్రపిండాల సమస్యలు, గర్భంతో ఉన్నవారు, జన్యు సమస్యలు, మూర్ఛ, మానసిక అనారోగ్యం, గత 3 నెలల్లో శస్త్ర చికిత్సలు, జ్వరం, బరువు తగ్గటం, రెండు వారాల క్రితం కుక్క కాటు బాధితులు లింటి వారు రక్తదానానికి అనర్హులు. ప్రసవం సమయంలో రక్తహీనతతో బాధపడే గర్భిణులకు రక్తం ఎంతో అవసరం. ఇలాంటి సందర్భంలో దాత రెండు ప్రాణాలను కాపాడిన వారవుతారు.

- డాక్టర్ ప్రసన్న రాగూర్, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి



అవసరమని తెలిస్తే స్పందిస్తాను

సకాలంలో రక్తం అందకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. రక్తం అవసరమని మెసేజ్‌లు వాట్సాప్, ఫేస్‌బుక్ ఇలా ఏ సామాజిక మాధ్యమంలో చూసినా వెంటనే స్పందిస్తాను. వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటాను. నిజంగా రక్తం అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తున్నాన్ను. నాతో పాటు మా అబ్బాయి పుట్టిన రోజున కూడా రక్తదానం చేయడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేశాను.

- ఎం.నందికేశవన్, తిరుమల



'ఫేక్' నాటక పాత్రధారి ఆపరేటర్!

● అతడు దొరికితేనే నకిలీ ఉత్తర్వుల చిక్కుముడి వీడేది

తిరుపతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఫేక్' నాటక పాత్రధారి గంగమ్మ ఆలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ పి.సి.నవీన్‌కృష్ణా కుమార్. దీని వెనుక సూత్రధారులు ఎవరనేది తేలాలంటే పరారీలో ఉన్న ఆపరేటర్ దొరకాల్సిందే. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భజంత్రీలుగా పనిచేస్తున్న జి.శివకుమార్ (నాదస్వరం), పి.వెంకటసుబ్బయ్య, ఆర్.జయరాం (డోలు), పి.అయ్యప్ప (శృతి), పి.రెడ్డెమ్మ (నాదస్వరం)ను గ్రేడ్1గా పదోన్నతి పొందినట్టు ఫేక్ ఉత్తర్వులతో పదోన్నతి కల్పించిన వ్యవహారంపై ఐదుగురిని సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన క్రమంలో 'గంగమ్మకే శఠగోపం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. పరారైన నవీన్‌ను పట్టుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అతడ్ని విచారిస్తేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని దేవదాయశాఖ అధికారులు అంటున్నారు. కాగా, వైసీపీ హయాంలో జరిగిన నకిలీ ఉత్తర్వుల కథ ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికే పరిమితమైందా? లేదా మిగిలిన దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లోనూ చోటుచేసుకుందా? అన్న అనుమానంతో 'ఆంధ్రజ్యోతి' ఆరాతీసింది. ఆర్జేసీ మల్టీజోన్-2 పరిధిలో 16 జిల్లాలు వస్తాయి. గంగమ్మ ఆలయ ఘటన వెలుగులోకి వచ్చాక ఈ ఆలయాల్లో పదోన్నతి ఉత్తర్వులను ఆర్జేసీ పరిశీలించారు. ఎక్కడా ఫేక్ ఉత్తర్వులు తమ దృష్టికి రాలేదని దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామకృష్ణారెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. గంగమ్మ ఆలయంలో మాత్రమే బయటపడ్డాయని, పరారీలో ఉన్న ఆపరేటర్‌ను విచారిస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. ఇక, వైసీపీ హయాంలో వెలుగు చూస్తున్న నిధుల దుర్వినియోగం, ఫేక్ ఉత్తర్వులు తదితరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆలయ మాజీ చైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు.

రాష్ట్రాభివృద్ధికి అండగా కేంద్రం

● పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదలపై త్వరితగతిన పరిష్కారం

● ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ చైర్మన్ తంబిదురై



సమావేశంలో మాట్లాడుతున్న బృందం చైర్మన్ తంబి దురై

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పలు పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదల అంశాలపై రాజ్యసభ చైర్మన్‌కు నివేదించి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.తంబిదురై అన్నారు. తిరుచానూరులోని తాజ్‌హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ హామీలు, వివిధ శాఖలకు సంబంధించి పలు అంశాలపై జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి నిధుల కొరత ఉందన్నారు. ఏపీకి నిధులు విడుదల, ప్రాజెక్టుల పురోగతికి, జాతీయ రహదారులు తదితర వాటి అభివృద్ధికి అండగా ఉండేందుకు కేంద్రం సుముఖంగా ఉందని, అందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనపై తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమిటీ సభ్యులు బీరేంద్రప్రసాద్ బైశ్య, నీరజ్ డాంగి, బాబుబాబ్ జేసంగ్‌బాయిదేశాయి, గిరిరాజన్, మహ్మమద్ నదిముల్ హక్, డాక్టర్ మేధా విశ్రామ్, కులకర్ణి, ఆదిత్యప్రసాద్, దర్శన్‌సింగ్, లహర్‌సింగ్, సిరోయా, జిగ్నేస్ సోలంకి, జేసీ శుభం బన్సల్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, బ్యాంకు అధిఆకరులు సత్యనారాయణరాజు, అలోక్ అగర్వాల్, పాండురంగ మితాంతయ, అశోక్ చంద్ర, సునీల్‌కుమార్ చుగ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై తేజోమయుడు





సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఉత్సవర్లు మాడవీధుల్లో విహరించారు. ఇక, ఉదయం వాహనం తర్వాత వేంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆండాళ్ ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణభట్టార్ తిప్పయ్యఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి రథోత్సవం: శనివారం ఉదయం 9.00-10.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

సత్యవేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదంటూ సత్యవేడు మండలం కన్నావరంలోని సచివాలయానికి భవన యజమాని శుక్రవారం అదనపు తాళం వేశారు. ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది అదనపు తాళాన్ని చూసి భవన యజమానిని సంప్రదించారు. సచివాలయానికి 24 నెలల అద్దె చెల్లిస్తేనే తాళం తీస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, ఏవో త్రివిక్రమరావు గ్రామానికి చేరుకుని భవన యజమాని మణి, సర్పంచ్ బాలకృష్ణతో చర్చించారు. అద్దె బకాయిలను పంచాయతీ నిధుల నుంచి చెల్లించేలా ఏర్పాటు చేశారు. దీంతో భవన యజమాని మణి అందుకు అంగీకరించి కార్యాలయం తెరవడంతో వివాదం సద్దుమణిగింది.



సచివాలయం వెలుపల వేచి ఉన్న సిబ్బంది

సర్పాల సయ్యాట



శ్రీరంగరాజపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామ సమీపంలోని మినరల్ వాటర్ ప్లాంట్ పక్కన శుక్రవారం సాయంత్రం రెండు సర్పాలు సయ్యాటలాడాయి. దీన్ని పలువురు గ్రామస్తులు తిలకించారు.

ఏటీఎస్ ద్వారా ఎఫ్‌సీ జారీ

17నుంచి అందుబాటులోకి వస్తుంది : డీటీసీ



నలగాంపల్లె సమీపంలో ఏర్పాటవుతున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్

చిత్తూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)ను ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ద్వారా జారీ చేయనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీసీ) నిరంజన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటీఎస్‌ను బంగారుపాళ్యం మండలం నలగాంపల్లె సమీపంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 17వ తేదీనుంచి ఏటీఎస్‌లో కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అప్పటినుంచి వాహనదారులు తమ వాహనాల ఎఫ్‌సీ కోసం ఏటీఎస్ వద్దకే వెళ్లాలని డీటీసీ సూచించారు.

కేంద్ర సర్వీసుల్లోకి హరినారాయణ



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇదివరకు చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన ఎం.హరినారాయణ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఆయన్ను ప్రభుత్వం రిలీవ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర తాగునీరు పారిశుధ్య శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. వైసీపీ హయాంలో హరినారాయణ.. జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు అప్పట్లో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా పనిచేసినట్లు ప్రచారం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చాక సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని సమాచారం. ఈ నేపథ్యంలో తనను కేంద్ర సర్వీసుల్లోకి తీసుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎక్కడ విక్రయించినా సరే మామిడి రైతు ఖాతాలో సబ్సిడీ!



యాదమరి మండలం ఆరిమాకులపల్లిలో మామిడి కాయలు లోడ్ చేస్తున్న రైతులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు మామిడిని ఎక్కడ విక్రయించినా సరే, వారి బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ మొత్తం జమకానుంది. ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు, ర్యాంపుల్లో మామిడి విక్రయించిన వారికి మాత్రమే ఉన్న సౌలభ్యాన్ని, జిల్లాలోని విక్రయ పరిస్థితుల దృష్ట్యా మరింత సులభతరం చేశారు.ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్దనే కాకుండా మామిడి కాయల మండీల్లో విక్రయాలకూ, లేక దేశంలోని ఏ రాష్ట్రానికైనా, విదేశాలకైనా ఎగుమతులు చేసుకునేందుకు వీలు కల్పించారు.ఇందుకోసం రైతులు ఎక్కడ విక్రయిస్తున్నారు, ఎక్కడికి ఎగుమతులు చేస్తున్నారనే వివరాలు అధికారుల వద్ద నమోదు చేసుకుని తగిన ఆధారాలు సమర్పించాల్సి ఉంది.ప్రభుత్వం ద్వారా కిలో రూ.4 చొప్పున వచ్చే సబ్సిడీ మొత్తాలను ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. జిల్లాలో 35 గుజ్జు పరిశ్రమలు పనిచేస్తున్నాయి, వీటికి తోడు 39 ర్యాంపులు, చిత్తూరు, బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. చిత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డుల్లో ఈ నెల 3 నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. వీటితో పాటు జపాన్, న్యూజిలాండ్, సింగపూర్, దుబాయ్, జర్మనీ, శ్రీలంక దేశాలకు సైతం ఎగుమతి జరుగుతోంది. ఈ క్రమంలో రైతులు సైతం నాణ్యమైన మామిడిని వివిధ రూపాల్లో విక్రయాలు చేసుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు కూడా ఇందుకు వెసులుబాటు కల్పించారు. ఏ రూపంలో విక్రయించుకున్నా, విక్రయించిన సరుకు వివరాలు అధికారుల వద్ద నమోదు చేసుకుంటే, ప్రభుత్వ సబ్సిడీ ఇస్తారని భరోసా ఇవ్వడంతో రైతులు ఆ దిశగా విక్రయాలకు మొగ్గు చూపుతున్నారు. కాగా శుక్రవారం జిల్లాలోని పలు గుజ్జు ఫ్యాక్టరీల వద్ద మామిడి వాహనాలు బారులు తీరి కనిపించాయి. 39 ర్యాంపులకుగాను 20 ర్యాంపు నిర్వాహకులకు లైసెన్సులు ఇచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

కొండపై ఫ్రీబస్ ట్రయల్ రన్

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై భక్తులు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించేలా తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఆర్టీసీ ట్రయల్ రన్ నిర్వహించింది. రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు వచ్చిన 10 ఎలక్ట్రిక్ బస్సులను ప్రస్తుతం టీటీడీ ఉచిత బస్సులు తిరుగుతున్న రూట్లలో గురు,శుక్రవారాల్లో తిప్పారు. మరికొన్ని రోజుల పాటు బస్సుల సంఖ్యను పెంచుతూ ఇలానే ట్రయల్‌రన్ నిర్వహిస్తారు.

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న ప్రకటించే జాతీయ అవార్డులు-2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభ, అసాధారణ విజయాలు సాధించిన దివ్యాంగులు, సంస్థలు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రీయ పురస్కార పోర్టల్ 'అవార్డ్స్.జీవోవీ.ఇన్' ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94405 73537ను సంప్రదించాలని కోరారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలనకు 349 మంది హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో ఎంపీఈడీకోర్సులో ప్రవేశానికి ఎస్వీయూలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన 349 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఎస్వీయూ వీసీ అప్పారావు, పీజీ సెట్ కన్వీనర్ వీసీ వేంకటేశ్వర్లు పరిశీలించారు. పరిశీలకులుగా శివశంకర్‌రెడ్డి (ఎస్వీయూ), శ్రీనివాస్ (ఎస్కేయూ), రామసుబ్బారెడ్డి (వైవీయూ), పాల్ (ఏఎన్‌యూ) పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐతో బ్యాంకు ఖాతా అనుసంధానం చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు తల్లికి వందనం పథకంలో స్కాలర్‌షిప్ మంజూరుకు ఎన్‌పీసీఐతో తల్లికి చెందిన బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతా లేకపోతే పోస్టల్ బ్యాంకులో నూతన ఖాతాలను తెరచి ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. శనివారం గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టల్ శాఖ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడికి మద్దతు ధరను ఫ్యాక్టరీల వద్ద ప్రదర్శించాలి

● టోకెన్ల మంజూరులో పారదర్శకతను పాటించేలా చర్యలు తీసుకోండి

● కలెక్టర్‌ను కోరిన రైతు సంక్షేమ సంఘ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మామిడికి మద్దతు ధరను ఆయా ఫ్యాక్టరీల వద్ద ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మామిడి సంక్షేమ సంఘం నేతలు కోరారు. శుక్రవారం సంఘ కన్వీనర్లు జనార్థన్, హరిబాబు చౌదరి కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడారు. మామిడి కాయలకు మద్దతు ధరను ఆయా ఫ్యాక్టరీల వద్ద ప్రదర్శించమని కలెక్టర్ చెప్పి ఐదు రోజులవుతున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ధరల పట్టికను పెట్టని ఫ్యాక్టరీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక పలు ప్రాసెసింగ్ యూనిట్ల వారు టోకెన్ల మంజూరులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొన్ని చోట్ల రాజకీయ జోక్యం అధికమైందని, ఇకనైనా పారదర్శకత పాటించాలన్నారు. రైతు నాయకులపై ఎఫ్-3 ఎండీ రమేష్ దురుసుగా ప్రవర్తించారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీడీ నెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ వద్ద టోకెన్లను పారేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని, లేకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మునిరత్నం నాయుడు, నేతలు భారతి, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

తాత్కాలిక పద్ధతిలో డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతులు

కలెక్టరేట్ ఏవోగా వాసుదేవన్ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో తహసీల్దారుగా పనిచేస్తున్నవారిలో 12 మందిని ఇతర మండలాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు కలెక్టరేట్ ఏవోగా ఆర్.వాసుదేవన్ నియమితులవగా, ఇక్కడ పనిచేస్తున్న కులశేఖర్‌ను చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా బదిలీచేశారు. బదిలీ అయిన తహసీల్దార్లు వెంటనే తమకు కేటాయించిన మండలాల్లో జాయిన్ కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలావుండగా.. ఇతర జిల్లాల్లో పనిచేస్తూ జిల్లాకు వచ్చిన వారిలో 11 మంది డీటీలను తాత్కాలిక పద్ధతిలో తహసీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

వివరాలిలా..: గంగవరానికి మాధవరాజు, సదుంకు ప్రమీళ, వి.కోటకు ఉదయ్ సంతోష్, చౌడేపల్లెకు పార్వతి, చిత్తూరు అర్బన్‌కు కులశేఖర్, ఐరాలకు లోకేశ్వరి, రొంపిచెర్లకు అమర్‌నాథ్, వెదురుకుప్పంకు బాబు, చిత్తూరు రూరల్‌కు జయప్రకాష్‌ను తహసీల్దార్లుగా నియమించారు. ● చిత్తూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా సీకే శ్రీనివాసులును నియమించారు. ● డీటీ నుంచి తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొంది తిరుపతి నుంచి బదిలీపై వచ్చిన రాజేంద్రకు కలెక్టరేట్‌లోని భూవిభాగంలో ప్రత్యేక తహసీల్దార్‌గా, రేఖకు శ్రీరంగరాజపురం తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో విధుల్ని కేటాయించారు. ● మండలాల్లో డీటీగా, ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న పలువురికి ఉద్యోగోన్నతిపై అదే మండలాల్లో తహసీల్దార్లుగా పోస్టింగుల్ని ఇచ్చారు. వీరిలో.. యాదమరికి పార్థసారథి, పూతలపట్టుకు రమేష్‌బాబు, విజయపురంకు కిరణ్, పులిచెర్లకు జయసింహ, గుడిపాలకు శ్రీనివాసులు, పెనుమూరుకు శ్రావణ్‌కుమార్, కార్వేటినగరంకు నాగరాజు, రామకుప్పంకు కౌలేషులు తహసీల్దార్లుగా పోస్టింగులను పొందారు.

'తల్లికి వందనం'పై విషం కక్కుతున్న వైసీపీ

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం'పై వైసీపీ విషం కక్కుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి పథకం వర్తింపజేస్తుంటే.. తట్టుకోలేక వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. రూ.2వేలు లోకేశ్ జేబులోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసీపీ పాలనలో కూడా రూ.13వేలు ఇచ్చారని.. అంటే అప్పుడు రూ.2వేలు జగన్ జేబులోకి వెళ్లాయా.. తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లాయా.. అని ప్రశ్నించారు. జగన్ పాలనలో కేవలం 42లక్షల మందికి మాత్రమే ఇస్తే.. ప్రస్తుతం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చారన్నారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులో కూడా కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైసీపీదని ఆరోపించారు. సూపర్ సిక్స్‌లోని తల్లికి వందనం పథకం అమలు చేయడంతో జీర్ణించుకోలేని వైసీపీ నేతలు.. కడుపు మంటతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

టీచర్లు తప్పు చేస్తే చర్యలు తప్పవు

కౌన్సెలింగ్‌లో అనుచిత లబ్ధిపై ఆర్జేడీ హెచ్చరిక ● నోషనల్ తేదీ నమోదు చేసుకున్న వారిపై విచారణ



టీచర్ల సమస్యలు పరిష్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బదిలీ కౌన్సెలింగ్‌లో టీచర్లు తప్పులు చేసి లబ్ధి పొందినట్లు తేలితే చర్యలు తప్పవని జిల్లా పరిశీలకులు, ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. చిత్తూరులో జరుగుతున్న ఎస్జీటీ కౌన్సెలింగ్‌ను పరిశీలించేందుకు శుక్రవారం వచ్చిన ఆయన పలు సమస్యలతో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేశారు. వీటితో పాటు టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో తప్పుడు సమాచారం నమోదు చేసి ప్రయోజనం పొందిన టీచర్లపై విచారణ చేపట్టారు.ఓ ఉపాధ్యాయురాలు (ఎస్జీటీ) ఉద్యోగం చేస్తున్న తన భర్త చనిపోగా, మరణానంతరం ప్రభుత్వ ద్వారా వచ్చే ప్రయోజనాలు (పెన్షన్) పొందుతూ, ప్రాధాన్యత బదిలీల్లో సింగల్ ఉమన్ అంటూ పేర్కొంది. దీని ద్వారా బదిలీలో ప్రయోజనం పొందిన, తర్వాత ఆమె మరో వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు అధికారుల దృష్టికి ఫిర్యాదు వచ్చింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. నిజమని తేలితే ఆ టీచర్‌ను సస్పెండ్ చేయనున్నారు. కాగా శుక్రవారం ఉదయం 11 గంటలకు వరుస సంఖ్య 1001 నుంచి కౌన్సెలింగు ప్రారంభం కాగా, రాత్రి 8 గంటల సమయానికి 1450 వరుస సంఖ్యకు చేరింది. క్రమ సంఖ్య 2 వేలు పూర్తి చేసే వరకు అధికారులు బదిలీలు కొనసాగించనున్నారు.

ఆ టీచర్లు, ఎంఈవోలపై విచారణకు కమిటీ

2008 డీఎస్సీ అభ్యర్థులు వేర్వేరు తేదీలతో హామీ పత్రాల ద్వారా పాఠశాలల్లో ఉద్యోగంలో చేరారు. దీనిపై నష్టపోతున్నామని పలువురు టీచర్లు కోర్టును ఆశ్రయించగా, నోషనల్ (ఒకే రకమైన)తేదీని పరిగణనలోకి తీసుకుని సీనియారిటీ, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చాలని తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును గౌరవించిన విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు పదోన్నతులకు నోషనల్ తేదీని పరిగణిస్తామని, బదిలీలకు యాక్చువల్ (జాయినింగ్) తేదీని పరిగణిస్తామని వివరణ ఇచ్చారు. కాగా మూడు రోజులుగా జరుగుతున్న బదిలీల్లో 165 మంది ఎస్జీటీలు నోషనల్ (ఒకే రకమైన) తేదీలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో నమోదుచేసి అదనపు పాయింట్లతో లబ్ధి పొందారు. కాగా టీఐఎస్‌లో యాక్చువల్ తేదీతో నమోదు చేసిన ఎస్జీటీలు బదిలీల్లో పాయింట్లు రాక నష్టపోయారు. బాధిత ఎస్జీటీలు శుక్రవారం ఆపస్ రాష్ట్రఅధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో ఆర్జేడీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్జేడీ నోషనల్ తేదీలతో లబ్ధిపొందిన టీచర్లతో పాటు, సమస్యను ఆన్‌లైన్‌లోసరిచేయని ఎంఈవోలపై విచారణకు ఆదేశించారు. నివేదిక రాగానే బదిలీల్లో లబ్ధి పొందిన టీచర్లతో పాటు ఎంఈవోలపై చర్యలు తీసుకోనున్నట్లు ఆర్జేడీ తెలిపారు.

34 ఎర్రచందనం దుంగల స్వాధీనం: నలుగురు స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పాలకొండలు రిజర్వు ఫారెస్టు పరిధిలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 34 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ కృపానందానికి చెందిన ఆర్ఎస్ఐ కె.అల్లీబాషా బృందం గురువారం కడప జిల్లా అటవీ ప్రాంతం అన్నా సముద్రం ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. శుక్రవారం ఉదయం పాలకొండలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. వారిని సమీపించడంతో పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఐదుగురు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. వారి నుంచి 34 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను, వాహనాలను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విలువ రూ.40 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేబిస్ రహిత ఏపీగా మార్చాల్సింది పశువైద్యులే

● వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ రమణ

తిరుపతి, జూన్13(ఆంధ్రజ్యోతి) : రేబీస్ రహిత ఏపీగా మార్చేందుకు ప్రతి పశువైద్యుడూ కృషి చేయాలని పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జేవీ రమణ కోరారు. అనిమల్ కేర్ ల్యాండ్ ఆధ్వర్యంలో వరల్డ్‌వైడ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో శునకాల జనన నియంత్రణ శస్త్రచికిత్స విధానాలపై రెండు వారాల శిక్షణా కార్యక్రమం తొలిబ్యాచ్ ముగింపు సమావేశం శుక్రవారం తూకివాకం వద్ద జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ భారత జంతు సంక్షేమ సంస్థ నిర్దేశించిన ప్రోటోకాల్ ప్రకారం శునకాల శస్త్రచికిత్స విధానాలను పశువైద్యులకు నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఔరంగాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు డాక్టర్ యుగంధర్ నాయుడు, డాక్టర్ నవీన్, తిరుపతి నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్ర రెడ్డి, అనిమల్ కేర్ ల్యాండ్ డాక్టర్ యజ్ఞవాల్క్యులు పాల్గొన్నారు.



నేటి నుంచి 'అంకితం నీకే అంకితం' కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గానగంధర్వుడు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా శనివారంనుంచి తిరుపతి మహతి ఆడిటోరియంలో రెండు రోజులపాటు ప్రముఖ గాయనీ, గాయకులతో సంగీత కచేరి జరగనుంది. అంకితం నీకే అంకితం పేరుతో తిరుపతి ఫిలిం సొసైటీ చేపట్టిన ఈ కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుంది. టీటీడీ ఈ కార్యక్రమానికి సహకరిస్తోంది. యువ గాయనీ, గాయకులు బాలసుబ్రమణ్యం పాడిన పాటలను ఆలపిస్తారు. హీరోయిన్, యాంకర్ ఇంద్రజ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 6 నుంచి 9 గంటల దాకా ఈ కార్యక్రమం సాగనున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు తెలిపారు. బాలు అభిమానులు, సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

పైపుల దుకాణంలో అగ్ని ప్రమాదం: రూ.3 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఒక పైపుల దుకాణంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. తిరుపతికి చెందిన రామలింగేశ్వరరెడ్డి రేణిగుంటరోడ్డులో ఎస్ఆర్‌ట్రేడర్సు పేరుతో పైపులు, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఇతర వస్తువుల దుకాణం పెట్టుకున్నారు. శుక్రవారం ఉదయం దేవుడి ఫొటోలకు పూజచేసి, దీపం వెలిగించారు. దీపం నుంచి ఎక్కువ మంట రావడంతో గాలికి పక్కనే ఉన్న ఫర్నీచర్‌కు అంటుకున్నాయి. ఈ విషయాన్ని యజమాని గమనించకపోవడంతో మంటలు పెద్దగా మారాయి. దాదాపు 80శాతం ఫర్నీచర్ కాలిపోయింది. రామలింగేశ్వర్‌రెడ్డి సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునిమంటలను అదుపుచేశారు. దీనిపై కేసు నమోదైంది.

నేడు వ్యవసాయ శాఖ మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శనివారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.45 గంటలకు మంత్రి చిత్తూరుకు చేరుకుంటారన్నారు. రెండు గంటలకు గుడిపాల మండలం పల్లూరులోని ఫుడ్స్ అండ్ ఇన్స్ మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమకు వెళతారు. మూడు గంటలకు మంగసముద్రం మార్కెట్ యార్డుకు చేరుకుని మామిడి రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుమలకు బయల్దేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

జిల్లాను పలకరించిన నైరుతి

20 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాను నైరుతి రుతుపవనాలు పలకరించాయి. గడిచిన 24 గంటల్లో 20 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నింద్ర మండలంలో అత్యధికంగా 88.2 మి.మీ, బైరెడ్డిపల్లెలో అత్యల్పంగా 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. విజయపురంలో 65.6, యాదమరిలో 55.2, పాలసముద్రంలో 54.2, గంగాధరనెల్లూరులో 50.4, నగరిలో 30.6, చిత్తూరులో 25.4, పెనుమూరులో 23.2, శ్రీరంగరాజపురంలో 20.4, వెదురుకుప్పం, కార్వేటినగరంలో 18.2, పూతలపట్టులో 10.4, గుడిపాలలో 5, శాంతిపురంలో 3.6, తవణంపల్లెలో 3.4, గంగవరంలో 3.2, పెద్దపంజాణిలో 3.2, పలమనేరులో 3, బంగారుపాళ్యంలో 2.6 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మతిస్థిమితంలేని వ్యక్తి వీరంగం

ఆపరేషన్ చేసే కత్తితో వైద్యులపై దాడికి యత్నం



మతిస్థిమితం లేని వ్యక్తిని అదుపు చేస్తున్న పోలీసులు

చిత్తూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రాత్రి మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం సృష్టించాడు. నార్త్ ఇండియాకు చెందిన ఓ యువకుడు చిత్తూరు నగరంలోని మల్లికార్జున కాలనీలో ఓ చిన్నారిని ఎత్తుకుంటుంటే స్థానికులు అతడిని కిడ్నాపర్‌గా భావించి దేహశుద్ధి చేశారు. గాయపడ్డ అతడిని బ్లూకోల్ట్స్ సిబ్బంది గమనించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అతడికి శస్త్రచికిత్స చేయడానికొచ్చిన వైద్యులపై ఆపరేషన్ థియేటర్‌లోని కత్తి, కుర్చీతో దాడికి యత్నించాడు. వైద్యుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు వచ్చి అదుపు చేశారు.

తండ్రిని చంపిన కుమారుడికి రిమాండ్

చిత్తూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తండ్రిని చంపిన కుమారుడిని రిమాండ్‌కు తరలించారు. గురువారం చిత్తూరు నగర పరిధిలోని లెనిన్‌నగర్‌లో ఉంటున్న లారీ డ్రైవర్ వెంకటరెడ్డి తన భార్య సరస్వతితో ఘర్షణపడి కత్తితో చంపడానికి ప్రయత్నించాడు. ఇంట్లోనే ఉన్న చిన్న కుమారుడు సోమశేఖర్‌రెడ్డి దీన్ని గమనించి ఆ కత్తిని లాక్కొని తండ్రి మెడపై బలంగా నరికాడు. వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు భయపడి పరారైన కుమారుడు రాత్రి రెండో పట్టణ పోలీసులు ఎదుట లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

శేషాచలంలో కొత్త పాము

● తూర్పు కనుమల్లో తొలిసారిగా రియోపా డెక్కనెన్సిస్ గుర్తింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యానికి కేంద్రమైన శేషాచలంలో మరో అరుదైన పాము కనిపించింది. రియోపా డెక్కనెన్సిస్‌గా పిలవబడే ఈ పామును తొలిసారిగా తూర్పు కనుమల్లో గుర్తించారు. ఈ వివరాలు జూటాక్సా అనే ఇంటర్నేషనల్ జర్నల్‌లో జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జడ్ఎస్ఐ) వెల్లడించింది. కనురెప్పలు అత్యంత పారదర్శకంగా, చారలు విభిన్న రేఖాంశంగా, శరీరం తక్కువ మందంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ జీవిపై పరిశోధనలో హైదరాబాదులోని బయాలజీ రీజినల్ సెంటర్, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, లండన్‌కు చెందిన నేచురల్ హిస్టరీ మ్యూజియం శాస్త్రవేత్తలు భాగస్వామ్యం వహించారు. సాధారణ పాము కంటే భిన్నంగా ఈ పాముకు శరీరంపై రెండు చోట్ల కాళ్ల ఆకారంగా కనబడుతోంది.

నేడు అడిగోపుల పురస్కారాల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కవి అడిగోపుల వెంకటరత్నం పురస్కారాలను శనివారం ప్రదానం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. సాహిత్యవేత్త రావెల సాంబశివరావు, పరిశోధక విద్యార్థి జి.రమేష్‌బాబుకు పురస్కారం అందజేస్తారు. పలువురు సాహిత్య ప్రముఖులు పాల్గొంటారని వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుంగనూరు లయన్స్‌క్లబ్ నోబుల్ ప్రతినిధులు ప్రోత్సాహకాలు అందజేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అమరావతి సురేశ్, త్రిమూర్తిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, షరీఫ్, కేశవరెడ్డి, రఘుపతిరెడ్డి, మల్లిఖార్జున, కుమార్, మంజునాథ్, హెల్పింగ్ లయన్స్ సభ్యులు, పాఠశాల హెచ్ఎం రుద్రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం విజయ్ రూపాణీకి నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు తులసీనాథ్ తదితరులు

కుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానికి కుప్పంలో బీజేపీ నేతలు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విమాన ప్రమాదంలో విజయ్ రూపానితోపాటు ఎంతో మంది ప్రయాణికులు మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్, కుప్పం మండల ప్రధాన కార్యదర్శి ఇంద్ర శ్రీధర్, అర్బన్ ప్రధాన కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని మంకలదొడ్డి పంచాయతీలో శుక్రవారం దీపం పథకం-2 కింద ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కష్టపడకూడదన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిపాజిట్ నగదు సైతం ప్రభుత్వం ద్వారానే చెల్లించి గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రామచంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ, టీడీపీ నాయకులు పూవి, మంగమ్మ, పన్నీరు, పళణి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రభుత్వం అండ



ముద్దనపల్లెలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని తెలుగు యువత రామకుప్పం మండల అధ్యక్షుడు వెంకటాచలం, కడ సలహా కమిటీ సభ్యుడు రఘులు తెలిపారు. శుక్రవారం వారు మండల పరిధి ముద్దనపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు నాగరాజనాయుడు, గంగాధరం, నందా, మంజునాథ్, సనావుల్లా, వెంకటేశ్, బాలాజీ, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

కందూరులో 'తల్లికి వందనం' సంబరాలు



కందూరులో కేక్ కట్ చేసి పిల్లలకు పెడుతున్న తల్లిదండ్రులు

సోమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నగదు తల్లుల ఖాతాల్లోకి జమ కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం కందూరు బస్టాండులో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, నెల్లిమంద టీడీపీ అధ్యక్షుడు సతీశ్, నీటిసంఘ మాజీ అధ్యక్షుడు సుబ్బరాయుడు, నౌషాద్, ఎస్సీఎల్ మండల అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళాలు



గన్నావారిపల్లెలో విరాళాలు అందజేస్తున్న దాతలు

సోమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠాపనకు బుంగావారిపల్లె గ్రామస్తులు విరాళాలు అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప తెలిపారు. సదాశివయ్య రూ.50,116, సురేంద్రబాబు రూ.30,116, రామచంద్రయ్యరూ.15,116, దశరథరామయ్య రూ.10,116, విశ్వనాథం రూ.10,116, వాసుదేవకుమార్ రూ.10,116, భాస్కర్ రూ.10,116, జి.జనార్ధన్ రూ.10,116 లతో పాటు పలువురు రూ.5 వేలు చొప్పున విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ఎస్వీ రమణ, కోశాధికారి జ్యోతీశ్వరుడు తెలిపారు. గన్నావారిపల్లెకు చెందిన బాలాజీ రూ. 1,02,116 అందజేయడంతో ఆ కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు అభినందించారు.

కేఈసీలో నేడు జాబ్ మేళా

కుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ, బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'కనెక్ట్ 3.0' పేరుతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ తెలిపారు. ఐటీ, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ సెక్టార్, కోర్ కంపెనీల వంటివి సుమారు 30కి పైగా ప్రతిష్ఠాత్మక సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో కేవలం కుప్పం నియోజకవర్గంలోని నిరుద్యోగులే కాకుండా.. మొత్తం రాష్ట్రంలోని ఏ పట్టభద్రులైనా పాల్గొని అర్హత కలిగిన ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు కలిగి, 2022, 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలలో ఆయా కోర్సులు పూర్తిచేసిన వారు జాబ్ మేళాలో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జాబ్ మేళాకు వచ్చే సమయంలో తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, బయోడేటా తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 9603929625, 8106128762 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

16న నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం

కుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన పురపాలక సంఘ కార్యాలయాన్ని ఈనెల 16న సోమవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. పాత పంచాయతీ కార్యాలయం స్థానంలో మున్సిపల్ భవనాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. అక్కడున్న కార్యాలయాన్ని ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పాత ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడున్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని 16వ తేదీన నూతన భవనంలోకి మారుస్తామని కమిషనర్ చెప్పారు. ప్రజలు ఇకపై నూతన భవనానికి వచ్చి పౌర సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

రేపు రామకుప్పంలో ఉచిత కంటి వైద్యశిబిరం

రామకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రి, రామకుప్పం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నటు ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు, చికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కారు ఢీకొని ఒకరి పరిస్థితి విషమం



గాయపడిన అగిస్తికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... చౌడేపల్లె మండలంలోని శెట్టిపేట పంచాయతీ, మేకలచిన్నేపల్లెకు చెందిన అగిస్తి(65) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. తిరుపతి-చౌడేపల్లె ప్రధాన రహదారిపై మేకలచిన్నేపల్లె మూడు రోడ్ల కూడలిలో తిరుపతి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో అగిస్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చంద్రగిరి నుంచి బోయకొండకు కారులో వస్తున్న కారులోని గణేష్ కుటుంబ సభ్యులు అదే కారులో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యుల సూచనలతో 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

రొంపిచెర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని అన్ని పంచాయతీల్లో వచ్చేనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కిషోర్ అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల బస్టాండు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీల్లో అసమానతలు తొలగించడానికి 30 ఏళ్లగా అలుపెరుగని పోరాటం చేసిన మహావ్యక్తి అన్నారు. ఆయన జన్మదినం వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు, రఘునాథ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

శాంతిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, వికోట మండలాల పరిధిలోని విద్యుత్తు ఉపకేంద్రాల్లోని పలు పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు కల్లూరు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు.

● **పలమనేరు:** పలమనేరులో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా 14న శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జీవన్‌కుమార్ తెలిపారు. పలమనేరు అర్బన్, పలమనేరు రూరల్, గంగవరం మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వి.కోట పంచాయతీ ఈవోగా శ్రీనాథరెడ్డి

వి.కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వి.కోట మేజర్ పంచాయతీ ఈవోగా శ్రీనాథరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేస్తున్న శివశంకర్‌ను రాళ్లబూదుగూరుకు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో గ్రేడ్-1 కార్యదర్శిగా రామకుప్పం ఈవోగా పనిచేస్తున్న శ్రీనాథరెడ్డి బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు తీసుకుంటూ పంచాయతీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

వరసిద్ధుడి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కడప జిల్లాకు చెందిన హిమబిందు రామకృష్ణయ్య పేరు మీదుగా రూ.1,00,116 శుక్రవారం విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల విలీనం మాకొద్దు..!

● ఎమ్మార్పీ కార్యాలయం, రోడ్లపై బైఠాయించి తల్లిదండ్రుల నిరసన



పుంగనూరు : రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పిల్లల తల్లిదండ్రులు



చౌడేపల్లె మండలం మిట్టూరులో పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పుంగనూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను పక్క గ్రామాల్లోని పాఠశాలలకు పంపలేమని రెండు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పుంగనూరు మినీ బైపాస్‌రోడ్డులో, ఎమ్మార్పీ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి నిరసన తెలిపారు. మండలంలోని పిచ్చిగుంట్లపల్లె గ్రామంలో 3, 4, 5 తరగతులు చదువుతున్న పిల్లలను రెండు కిలో మీటర్ల దూరంలోని గూడూరుపల్లె ప్రభుత్వ హైస్కూల్‌కు బదిలీ చేయడంతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోనే పాఠశాలను నడపాలని డిమాండ్ చేశారు. పిల్లల తల్లిదండ్రులు జయకుమార్, అమరనాథరెడ్డి, లక్ష్మీదేవి, వేణుగోపాల్, దేవమ్మ, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నల్లగుట్టపల్లె తాండాలో 45 మంది పిల్లలున్నా కిలోమీటరు దూరంలోని పూజగానిపల్లెకు 3, 4, 5 తరగతుల పిల్లలను బదిలీ చేయడంతో నిరసన తెలిపారు. ఎంఈవో నటరాజరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ దేశానాయక్, బాబునాయక్, నాగరాజనాయక్, హరినాయక్, శివనాయక్ పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** మిట్టూరు ప్రాథమిక పాఠశాలను పుదిపట్ల పాఠశాలలో విలీనం చేయొద్దని శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద నిరసన చేశారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



సోమల: పెద్దఉప్పరపల్లెలో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న టీడీపీ నాయకులు



రామకుప్పం బాలికోన్నత పాఠశాలలో కిట్లను పంపిణీ చేస్తున్న ఆనందరెడ్డి



శాంతిపురంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

రొంపిచెర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు అంజాద్‌ఖాన్, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకుడు షేక్‌కరీముల్లా, నాయకులు రామమూర్తి, రాధాకృష్ణ, హయత్‌బాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **సోమల:** మండలంలోని పెద్దఉప్పరపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడుహెచ్ఎం లోకేశ్వరి, మాజీ సర్పంచి బాలాజీ నాయుడు, రెడ్డెప్పనాయుడు, పెద్దరెడ్డెప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. శుక్రవారం రామకుప్పం బాలికోన్నత పాఠశాల, మద్దునల్లె, విజలాపురం ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఇతర కిట్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లోకి ఆర్థిక సాయం జమ చేస్తోందన్నారు.ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, జనసేన మండలాధ్యక్షుడు హరీష్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, కేశవరెడ్డి, సలాంసాబ్, నందారెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, టీవీరవి, సుబ్రీ, మంజునాథ్, అవినాశ్, నరసింహా, కుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, వేణుగోపాల్‌రెడ్డి, భువన్‌రెడ్డి, మణేష్‌నాయుడు పాల్గొన్నారు.

● **శాంతిపురం:** మండల పరిధిలోని రాళ్లబూదుగూరు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జయరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకారం

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

వి.కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంలో వి.కోట మండలాభివృద్ధికి పనిచేయాలని చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు టీడీపీ నేతల ఆదేశాల మేరకు వైసీపీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు చోట్ల చెరువుల్లో మట్టిని తీస్తుంటే అధికార నేతలకు అనుమతులు ఇస్తూ, వైసీపీవర్గీయులకు అభ్యంతరాలు చెప్పడం సరికాదన్నారు. గృహనిర్మాణ పనులో వేగం తగ్గిందని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణం చర్యలు చేపట్టాలని సూచించారు. మండల పరిధిలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని.. పరిష్కరించాలన్నారు. వి.కోటలో పోస్టుమార్టం సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానికంగా సీహెచ్‌సీలో ఈ సదుపాయం కల్పించేలా సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

కె.కొత్తూరులో డీఎస్పీ విచారణ



కె.కొత్తూరులో ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

వి.కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం కె.కొత్తూరులో కాటమరాజుల ఆలయం వద్ద ఉత్సవాలు జరిపే విషయమై వచ్చిన వివాదంపై పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఇరువర్గాలకు సంబంధించిన విషయం కావడంతో జిల్లా ఎస్పీ సూచనల మేరకు విచారించి ఆలయం వద్దకు చేరుకొని ఇరు పక్షాల సమక్షంలో గతంలో ఉన్న రాతి బండలను యథాప్రకారం నాటించి ఉత్సవాలు జరిగే వరకు అందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఉత్సవాల అనంతరం స్థలం ఎవరికి చెందిందో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారును ఆదేశించారు. విచారణలో ఆయన వెంట ఎస్సై జావేద్, ఏఎస్సై మురళీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



ఆలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు, నాయకులు

శాంతిపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా గ్రామ దేవత ఆలయాలు, వినాయక స్వామి, ఓం శక్తి ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుతో కలిసి స్థలాలను పరిశీలించారు. మఠం, రాళ్లబూదుగూరు, వడ్డువంక, సోగడబల్ల, ఎంకేపురం, గుండిశెట్టిపల్లె, దండికుప్పం, కొలమడుగు తదితర గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణానికి గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటి నిర్మాణానికి స్థలాలను పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పీవీ నాగరాజు, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, మణి, రమేష్, ఏఎంసీ నాగరాజు, గోపాల్, మంజునాథ్, జయరామిరెడ్డి, మునిరెడ్డి, జయపాల్, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయభారం



పంచపాండవులకు పూజలు చేస్తున్న పురోహితులు

సోమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోమల సమీప భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా శుక్రవారం పంచపాండవుల ఆలయంలో ఉభయదారులు బత్తల శివరాజ, పండు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను భారతంమిట్టలో ఊరేగించారు. రాత్రి శ్రీకృష్ణరాయభారం ప్రదర్శనకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అదృశ్యం కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లెకు చెందిన ఆంజప్ప కుమార్తె శ్యామల ఈనెల 9 నుంచి కనిపించడం లేదని శుక్రవారం తండ్రి పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వి.కోట మండలం నెర్నిపల్లికి చెందిన వాసుతో ఆమెకు వివాహం జరిగిందని.. శ్యామల, తన పిల్లలు హారిక, నాలుగు నెలల కుమారుడితో కలిసి అదృశ్యమయ్యారని తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణ తెలిపారు.

అప్పు చెల్లించలేదని భార్యాభర్తలపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటన పుంగనూరు మండలంలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు... మండలంలోని గూడూరుపల్లెకు చెందిన వెంకటరమణ, అతని భార్య సుజాత అదే గ్రామానికి చెందిన శరత్‌బాబు వద్ద ఏడాది క్రితం రూ.లక్ష అప్పుగా తీసుకొని వడ్డీ చెల్లిస్తున్నారు. అసలు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. అయినా వారిపై దాడి చేసి గాయపరచడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

పుంగనూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టచింతలవారిపల్లె పంచాయతీ బరిణేపల్లెకు చెందిన త్రిమూర్తి కుమార్తె వివాహిత గీతా అదృశ్యమైంది. ఎక్కడ వెతికినా జాడలేకపోవడతో తండ్రి పుంగనూరు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కర్నాటక రాష్ట్రం మార్తల్లి సమీపంలోని ఎల్దార్‌కు చెందిన బాలాజీతో వివాహం జరిగిందని.. ఈనెల 11 నుంచి గీతా కనిపించడం లేదని త్రిమూర్తి తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పుంగనూరు ఏఎస్ఐ యూసఫ్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పుంగనూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామానికి చెందిన కె. మంజులకు చిన్నమండ్యం మండలం కలిబండ గ్రామానికి చెందిన కుళ్లాయప్పతో వివాహం జరిగింది. అయితే గత కొంత కాలంగా అదనపు కట్నం రూ.4 లక్షలు తీసుకురావాలని ఒత్తిడి చేయడం, వేధించడంతో మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బిడ్డల నుంచి భరణం ఇప్పిస్తాం

● వృద్ధులైన తల్లిదండ్రులతో న్యాయమూర్తి ఎం.ఎస్.భారతి


వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎంఎస్ భారతి

చిత్తూరు లీగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వృద్ధులైన తల్లి దండ్రుల బాగోగులను పట్టించుకోని బిడ్డల నుంచి భరణం ఇప్పిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.భారతి అన్నారు. తపోవనం వద్ద ఉన్న వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులకు సలహాలు, సాయం కావాలంటే జిల్లా కోర్టు పరిధిలో ఉన్న డీఎల్ఎస్ఏ ఆఫీసుకు రావచ్చన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమసంఘం మాజీ అధ్యక్షుడు కేశవులు, మురళి, డిజేబుల్ వెల్ఫేర్ వసతి గృహం స్టాఫ్ నర్స్ అరుణ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రతాప్‌రెడ్డి

తవణంపల్లె, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాఖలవారీగా సమీక్షించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ భారతి, సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి కడప జిల్లాకు చెందిన హిమబిందు రామకృష్ణయ్య పేరు మీదుగా రూ.1,00,116 శుక్రవారం విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

● సిబ్బందికి వ్యవసాయశాఖ జేడీ ఆదేశం

పూతలపట్టు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జేడీ మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం పి.కొత్తకోట రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. వేరుశనగ విత్తనాలను రైతులకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి మధురవాణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'యోగాంధ్ర రిహార్సల్' విజయవంతం చేద్దాం

వెదురుకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో శనివారం జరిగే యోగాంధ్ర రిహార్సల్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో పురుషోత్తం అన్నారు. తన కార్యాలయంలో ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.

పెనుమూరు: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, ఏపీవో గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితా' సమావేశం వెలవెల

● టీడీపీ, వైసీపీల నుంచి ఇద్దరు నేతలే హాజరు


సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ బాబు

గంగాధరనెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీ కోసం ఏర్పాటు చేసిన సమావేశం నేతల్లేక వెలవెలబోయింది. కనీసం 15 మందికిపైగా హాజరు కావాల్సిన సమావేశానికి టీడీపీ తరఫున చిన్న, వైసీపీ నుంచి వేలుమొదలి మాత్రమే వచ్చారు. మిగిలిన పార్టీల నాయకులెవరూ రాలేదు. గంగాధరనెల్లూరు తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం పరిస్థితి ఇదీ. ఈ సందర్భంగా వెదురుకుప్పం తహసీల్దార్ బాబు మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఎల్వోలపై చర్యలు తీసుకోవడానికి ఈఆర్వో ద్వారా జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. కార్వేటినగరం, శ్రీరంగరాజుపురం తహసీల్దార్లు నాగరాజు, లోకనాథపిళ్ళై, ఎన్నికల డీటీ కరణం మోహన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'కు 14 అర్జీలు


బాధితురాలి అర్జీని పరిశీలిస్తున్న వెంకటరామిరెడ్డి

చిత్తూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 14 అర్జీలు అందాయి. బాధితుల నుంచి అర్జీలను ఎంఈ వెంకటరామిరెడ్డి స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని సూచించారు. ట్రాన్స్‌కో ఏడీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, హౌసింగ్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం



మీడియాతో మాట్లాడుతున్న చిత్తూరు కమ్మవారి అభ్యుదయ సేవా సంఘ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో విజయం కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధ్యక్షుడు కేశవులు నాయుడు సంఘం నేతలతో కలిసి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాకు తెలిపారు. తిరుపతి అమర ఆస్పత్రి వైద్యుల సహకారంతో నిర్వహించే శిబిరాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్ ప్రారంభిస్తారని చెప్పారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. నగరవాసులతోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు మేళం రవియాదవ్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ పరిధిలో 33, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నారు. ఈ కారణంగా పూతలపట్టు నియోజకవర్గంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

5న లోక్ అదాలత్

చిత్తూరు లీగల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఐదో తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్‌తోపాటు పలు కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రానికి తాళం వేసిన గ్రామస్తులు

సరిగా తెరవడం లేదని ఆవేదన

పాలసముద్రం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీపీఎన్ఆర్‌పురంలోని అంగన్వాడీ కేంద్రం సరిగా తెరవడం లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ కేంద్రానికి తాళం వేసి నిరసన తెలిపారు. గ్రామస్తులతో కలిసి సర్పంచ్ అమరావతి మీడియాకు వివరాలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న టీచర్ మూడు నెలలుగా సక్రమంగా రావడం లేదన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం సైతం సక్రమంగా అందించడం లేదని చెప్పారు. ఈ విషయమై ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవోలకు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే ఈ కేంద్రాన్ని తెరవకూడదని ఇక్కడున్న ఆయాకు చెప్పారు. ఆమె కేంద్రానికి తాళం వేసి వెళ్లాక, గ్రామస్తులు మరో తాళం వేశారు. అధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకు కేంద్రాన్ని తెరిచేది లేదని స్పష్టం చేశారు.


అంగన్వాడీ కేంద్రానికి వేసిన తాళాలను చూపుతున్న గ్రామస్థుడు

గంగాధరనెల్లూరుకు బదిలీపై 13మంది కార్యదర్శులు

గంగాధరనెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలానికి ఇతర మండలాలనుంచి బదిలీపై కొత్తగా 13మంది పంచాయతీ కార్యదర్శులు వస్తున్నారు. వీరిలో.. శ్రీరంగరాజపురంలోని చైతన్యకుమార్ కలిజవేడుకు, వి.కోటలోని త్యాగరాజు కొత్త వెంకటాపురానికి, హరికృష్ణ ఎల్లాపల్లెకు, ప్రభాకర్ కోటాగరానికి, నరేష్ నెల్లేపల్లెకు, సోమశేఖర్ పాతపాళ్యంకు, ఆనంద్ చిన్నవేపంజేరికి, యాదమరిలోని కల్పన బుక్కాపట్నంకు, శిరీష తూగుండ్రంకు, పూతలపట్టులోని వెంకటరమణ బాలగంగనపల్లెకు, తంబళ్లపల్లెలోని గౌతమి వరత్తూరుకు, చిత్తూరులోని రేఖ వీరకనెల్లూరుకు, బంగారుపాళ్యంలోని అనిల్‌కుమార్ కడపగుంటకు బదిలీ అయ్యారు. ఈ మండలంలో పనిచేస్తున్న కార్యదర్శుల్లో.. గంగాధరనెల్లూరులోని పి.ఎం.చంద్ర, కొత్తవెంకటాపురంలోని మనోజ్, పాతపాళ్యంలోని వై.కుమార్‌లు గుడిపాల మండలానికి, వేల్కూరులోని దుర్గాప్రసాద్, తూగుండ్రంలోని మురళిలు పెనుమూరుకు, కలిజవేడులోని లావణ్య బంగారుపాళ్యంకు ఎల్లాపల్లెలోని శివప్రసాద్‌రెడ్డి తవణంపల్లె మండలానికి వెళ్లనున్నారు. పక్కనున్న పంచాయతీలకు వెళ్లినవారిలో బాలగంగనపల్లె కార్యదర్శి శివయ్య గంగాధరనెల్లూరుకు, చిన్నవేపంజేరిలోని నిర్మల వేల్కూరుకు, వరత్తూరు కార్యదర్శి శ్రీనాథ్ వింజంకు బదిలీ అయ్యారు.

గతంలో ఒక్కరికే.. ఇప్పుడు ముగ్గురికి..!

'తల్లికి వందనం'పై తల్లిదండ్రుల ఆనందం


ముగ్గురు కుమారులతో తల్లి శశికళ

పెనుమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ హయాంలో అయితే మాకు ముగ్గురు పిల్లలున్నా ఒక్కరికే నగదు అందేది. ఇప్పుడు తల్లికి వందనం పథకం కింద ముగ్గురు పిల్లలకూ నగదు జమైంది' అని పెనుమూరు మండలంలోని గుంటిపల్లె గ్రామానికి చెందిన శశికళ, ప్రసాద్ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. ఈ ముగ్గురికీ కలిపి రూ.39వేలను శశికళ బ్యాంకు ఖాతాలో జమ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగరి మండలంలో 3,791మందికి లబ్ధి

నగరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో 3,791 మందికి తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందారని అధికారులు తెలిపారు. దేశూరు అగరం దళితవాడలో నివసిస్తున్న ప్రభాకర్, ఇళయరాణి దంపతులకు ముగ్గురు సంతానం. ఈ ముగ్గురికీ కలిపి రూ.39వేలను తన బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని ఇళయరాణి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఒక బిడ్డకే ఇచ్చారని.. ఇప్పుడు ముగ్గురు పిల్లలకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.


ముగ్గురు పిల్లలతో తల్లి ఇళయరాణి

మా పిల్లలను ఆ బడికి పంపలేం

చెరువుతో ప్రమాదం ● చిన్నంపల్లె గ్రామస్తుల నిరసన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఈవో రుక్మిణి తదితరులు

యాదమరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలను కొనసాగించాలని యాదమరి మండలంలోని చిన్నంపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. 3, 4, 5 తరగతి చదువుతున్న విద్యార్థులను రెండు కిలోమీటర్ల దూరంలోని కీనాటంపల్లెలోని బడికి మార్చారన్నారు. ఈ బడికి వెళ్లే దారి మధ్యలో కొత్తచెరువు ఉందని చెప్పారు. ఇటీవలే ఈ చెరువులో సరదాగా ఈతకోసమని దిగి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారన్నారు. ఈ పరిస్థితుల్లో కీనాటంపల్లెలోని బడికి పంపడానికి తాము సిద్ధంగా లేమని ఎంఈవో, హెచ్ఎంకు స్పష్టం చేశారు. లేదంటే తమ పంచాయతీకి చెందిన యాదమరి బడికి పిల్లలను మార్చాలని కోరారు. అంతవరకు పిల్లలను బడికి పంపేది లేదని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రుక్మిణి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. వినాయకం గౌండర్, అమలనాథన్, రాఘవ, దాము తదితరులు పాల్గొన్నారు.

నాలుగు టిప్పర్ల సీజ్

● తమిళనాడుకు గ్రావెల్ అక్రమంగా తరలిస్తుండటంతో పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనాలు

పాలసముద్రం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ కండ్రిగ పంచాయతీ నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండగా నాలుగు టిప్పర్లను తిరుపతి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్ సీజ్ చేశారు. వాహనాలను పాలసముద్రం పోలీసులకు శుక్రవారం అప్పగించారు. మండలం నుంచి కొన్ని నెలలుగా గ్రావెల్‌ను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు అందాయి. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీ చేసి, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

మినీవ్యాను బోల్తా: డ్రైవర్‌కు స్వల్పగాయాలు


బోల్తాపడిన మినీ వ్యాను

పూతలపట్టు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మినీవ్యాను బోల్తా పడడంతో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. చిత్తూరు నుంచి పీలేరువైపు మినీవ్యానులో కోళ్లవ్యర్థాలు తీసుకెళుతుండగా రంగంపేట క్రాస్‌రోడ్డు వద్దకొచ్చేసరికి కడప నుంచి చిత్తూరు వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాను బోల్తాపడింది. ఈ ఘటనలో మినీవ్యాను డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

● కుమార్తె ప్రేమ వ్యవహారమే కారణమని ప్రచారం

ఐరాల(కాణిపాకం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కుమార్తె ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సంఘటన శుక్రవారం కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చింతగుంపలపల్లెకు చెందిన ధనశేఖర్ ఆచారి (47) కుమార్తె స్థానికంగా ఓ యువకుడిని ప్రేమించింది. దీనికి తండ్రి ఒప్పుకోలేదు. తన మాట కుమార్తె వినక పోవడంతో మనస్తాపానికి గురైన ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆత్మహత్యపై కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు దుకాణాల చోరీ కేసులో పట్టుబడ్డ దొంగ!

చిత్తూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండు దుకాణాల్లో జరిగిన చోరీ కేసులో దొంగను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఈనెల ఐదో తేదీన బజారువీధిలోని శరవణ జ్యూవెలర్స్‌లో రూ.11 లక్షల విలువ చేసే 120 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి, రంగా స్టీల్స్ దుకాణంలో రూ.రెండు లక్షల చిల్లర నాణేలను చోరీ చేశారు. సీసీ ఫుటేజీ, సాంకేతికతను ఉపయోగించి దొంగను తమిళనాడులో శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శనివారం అరెస్టు చూపే అవకాశం ఉందని తెలిసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

క్రైం కార్నర్

నగరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో శుక్రవారం ఆరుగురిని నగరి కోర్టులో హాజరు పరిచారు. విచారించిన జడ్జి సి.జానకి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.60వేల జరిమానా విధించినట్లు సీఐ విక్రమ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మూడు నెలలుగా డ్రంకెన్ డ్రైవ్ కేసులో 17 మందిని అరెస్టు చేయగా, రూ.1.70లక్షల జరిమానా విధించారు. బహిరంగంగా మద్యం తాగిన కేసులో 55 మందిని అరెస్టు చేయగా, రూ.55వేల జరిమానా విధించారని సీఐ వివరించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెనుమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్ఐ రామచంద్రయ్య తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలానికి చెందిన మధుసూదన్, భానుప్రకాష్, పెనుమూరుకు చెందిన మురళి, శ్రీనివాసులు, వినోద్, ప్రసాద్, చిత్తూరు సంతపేటకు చెందిన భాస్కర్‌లు పెనుమూరులోని కేవీఆర్ గ్రాండ్‌లో పేకాడుతున్న సమాచారం పోలీసులకు అందింది. దాంతో చిత్తూరు స్పెషల్ బ్రాంచి సిబ్బంది స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.24,108, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని చైన్‌ను ఓ వ్యక్తి లాక్కెళ్లాడు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జున కాలనీకి చెందిన స్వర్ణలత శుక్రవారం ఉదయం కట్టమంచి చెరువు కట్టపై వాకింగ్ చేస్తున్నారు. వెనుకనే మాస్కు ధరించి వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని సుమారు రూ.3లక్షల విలువైన 30 గ్రాముల బంగారుచైన్‌ను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాలపై ఎంపీ, ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

చిత్తూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లావాసులు మరణించడం, బంగారుపాళ్యం మండలంలో ముగ్గురు మృతి చెందడంపై ఆయా కుటుంబాలకు ఒక ప్రకటనలో సంతాపంతెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

తిమ్మోజుపల్లెలో విషాదఛాయలు

బంగారుపాళ్యం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తమ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వక్కల రాజేంద్రనాయుడు, వ్యవసాయశాఖ విస్తరణ అధికారి సాదరయ్య మృతి చెందడంతో తిమ్మోజుపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే గ్రామస్తులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేంద్రనాయుడి మృతదేహం వద్ద ఆయన భార్య గౌరి, కుటుంబీకుల రోదనలు చూసిన వారంతా కంటతడి పెట్టుకున్నారు.

రాజేంద్రనాయుడు మృతి పార్టీకి తీరని లోటు: టీడీపీ

రాజేంద్రనాయుడు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ బంగారుపాళ్యం అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ అన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే టీడీపీ నాయకులు ఎన్పీ జయప్రకాష్, జయచంద్రనాయుడు, జనార్ధన్‌గౌడ్, ఎన్ఆర్ఐ విక్రమ్, హేమచంద్రనాయుడు, కోకా ప్రకాష్‌నాయుడు, రమేష్, హరిప్రసాద్, రవీంద్రనాయుడితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాజేంద్రనాయుడు మృతదేహాన్ని చూసి అందరూ విలపించారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడని గుర్తుచేసుకున్నారు. పోస్టుమార్టం అయ్యాక గ్రామానికి మృతదేహాన్ని తీసుకురాగా, టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళి అర్పించాయి. రాజేంద్రనాయుడి పాడెను ఎన్పీ ధరణీప్రసాద్, జయప్రకాస్ మోశారు. సాదరయ్య మృతిపట్ల వ్యవసాయ శాఖ సిబ్బంది సంతాపం తెలిపారు.



రాజేంద్రనాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు - టీడీపీ నాయకులతో కలిసి పాడె మోస్తున్న ఎన్పీ జయప్రకాష్

విమాన ప్రమాదంలో మృతులకు సంతాపం

చిత్తూరుఅర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాదులో జరిగిన విమాన ప్రమాద మృతులకు సంతాపంగా శుక్రవారం నగరంలో వైసీపీ నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అలాగే బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జిల్లావాసుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాయత్రిదేవి, హరిణిరెడ్డి, కేపీ శ్రీధర్, అనూ, గిరిబాబురెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఇద్దరు ఎంపీడీవోల బదిలీ

గంగాధరనెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలసముద్రం ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.కృష్ణమహేష్‌రెడ్డిని గంగాధరనెల్లూరుకు, గంగాధరనెల్లూరులోని సోమలరాజు సతీష్‌ను పాలసముద్రం ఎంపీడీవోగా బదిలీచేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పూతలపట్టు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన కాంపిటీటివ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను ప్రిన్సిపాల్ రమేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఎన్‌సీసీ అధికారి సత్య పాల్గొన్నారు.

సన్మానం



చిత్తూరు కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేసి తిరుపతి ట్రెజరీకి బదిలీ అయిన భానుప్రకాష్ నాయుడిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా విశ్రాంత కళాశాలల లెక్చరర్ల సంఘం జోనల్ సెక్రటరీ వి.హరినాయుడు, జిల్లా సెక్రటరీ చంద్రశేఖర్, సభ్యులు వినాయకం, గోవిందస్వామి, సీఎల్ కుమార్, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పన్నూరులో టీబీపై అవగాహన



విజయపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పన్నూరులో శుక్రవారం టీబీపై వైద్యాధికారి విష్ణుప్రియ అవగాహన కల్పించారు. సీహెచ్‌వో వాసవి, సూపర్‌వైజర్ పవన్, ఏఎన్ఎం సుహాసిని తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని జంబాడ, విజయపురం బీసీ బాలుర వసతి గృహంలో మలాథియాన్ మందు పిచికారీ చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



చిత్తూరు కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తేనెబండ ముత్యాలమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో వెంకటరాయలు, అర్చకులు, ఉత్సవ నిర్వాహకులు యుగంధర్ బాబు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా 'అర్జున తపస్సు'



వెదురుకుప్పం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం తూర్పు అరుంధతీవాడ మాతమ్మ తిరునాళ్లలో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్య నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.